క్లుప్తంగా

ముసురుతో రైతన్న వెన్నులో వణుకు



గుడ్లవల్లేరు: ముసురుతో రైతన్నకు వెన్నులో వణుకు పుడుతోంది. కురుస్తున్న వర్షపు జల్లులతో మండలంలోని పనల మీదున్న వరి పొలాలు మునక బారిన పడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే తడిసిన కుప్పలను రైతులు నష్టం వచ్చినా నూర్పుళ్లను యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నారు. అయితే ఈ కుప్పల్లో ధాన్యం రంగుమారుతోంది. ఈ రంగుమారిన కారణంగా ధాన్యం ధర పూర్తిగా దిగజారిపోతుంది. ఈ వర్షాల కారణంగా కొన్ని చోట్ల వరి కంకులు మొలకెత్తున్నాయి. దీంతో పంటలు కాపాడుకునేందుకు రైతులు తలమునకలవుతున్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

మండవల్లి: మండవల్లి, కొవ్వాడలంక గ్రామాల్లో కోడిపందేల స్థావరాలపై దాడి చేసి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్టు బుధవారం పోలీసులు తెలిపారు. మండవల్లి గ్రామంలోని శ్మశాన వాటికలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,050 నగదు, ఒక కోడి, కత్తి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కొవ్వాడలంలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,020 నగదు, ఒక కోడి, కత్తి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. అయ్యవారిరుద్రవరంలో స్కూల్ పక్కన జూదమాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,520 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు మండవల్లి పోలీసులు తెలిపారు.

పంట కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపు



కైకలూరు: పంట కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. గోపవరం నుంచి నరసాయిపాలెం వరకు పూడికతీత, డెక్క తొలగింపు పనులను నీటి సంఘల చైర్మన్ పొత్తూరి సురేష్‌రాజు పరిశీలించారు. ప్రాధాన్యత క్రమంలో పంట కాలువల మరమ్మతులు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పేరిచర్ల ప్రసాద్ రాజు, పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, బోయిన శ్రీనివాసరావు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


మహిళ మిస్సింగ్‌పై కేసు నమోదు

పెదపారుపూడి: ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోవటంతో బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని గుర్విందగుంట గ్రామానికి చెందిన కోమటి భానుశ్రీ వ్యవసాయ కూలిగా పని చేస్తూ ఇంటి వద్దనే ఉంటుంది. భర్త నాగ దుర్గారావుతో గొడవ పడటం వలన మనస్థాపంతో ఈ నెల 23న ఇంటి వద్ద నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఎరుపు, తెలుపు రంగు గల చీర ధరంచి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన ఎడల పెదపారుపూడి స్టేషన్ ఎస్ఐ ప్రవీణకుమార్‌రెడ్డి సెల్ నంబరు 94401 13645 సమాచారం అందించాలని కోరారు.

పెద్దింట్లమ్మ సన్నిధిలో లలితా సహస్రనామ పారాయణం

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలానికి చెందిన 450 మంది మహిళా భక్తులు లలితా సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణం బుధవారం నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్దింట్లమ్మను దర్శించుకున్నారు. ఆలయ దేవస్థాన సిబ్బంది భక్తులకు అల్పాహారాన్ని అందించారు.

భక్తి శ్రద్ధలతో భవానీల ఇరుముడులు



కైకలూరు: భవానీ మాలధారుల ఇరుముడుల పూజలు వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని కనకదుర్గ ఆలయంలో భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. భవానీ మాలధారుల కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం వాహనంలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి మాలధారులు తరలివెళ్లారు.

లోక శాంతి కోసం ఏసుక్రీస్తు జననం

పామర్రు: లోక శాంతి కోసం ఏసుక్రీస్తు జన్మించారని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని బేతేలు గాస్పల్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంపీపీ మాట్లాడారు. ఇతరులకు మేలు చేయడమే క్రిస్మస్ అని అన్నారు. ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని ఎంపీపీ అభినందించారు. చిన్నారులకు బహుమతులను అందజేశారు. పాస్టర్లు సీహెచ్ ఏసుపాదం, సీహెచ్ కృష్ణ, సుబ్రమణ్యం, కె.బుజ్జి, ప్రభుదాసు పాల్గొన్నారు.

పెదమద్దాలిలో..

పాప పరిహార్థమై ప్రభువు క్రీస్తు జన్మించారని ప్రముఖ పాస్టర్ సమ్మంగి కృష్ణపాల్ అన్నారు. మండలంలోని పెదమద్దాలిలోని సెయింట్ పాల్ చర్చిలో క్రిస్మస్ పండుగ నిర్వహించారు. అనంతరం కేకును కట్‌చేసి సీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమ్మంగి సత్యరూతు, కాకే ప్రసాద్, పట్టింనాంచారయ్య, కంభం శేఖర్, కాకొల్లు రాజ్యలక్ష్మీ, దోమతోటి గ్రేసమ్మ, పోలే కృపమ్మ, కంచర్ల షారోన్ పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని మేడూరు, కృష్ణాపురం, ముత్రాసిపాలెం, దేవరపల్లిలోని సీబీసీఎన్‌సీ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు పాస్టర్ రాజారత్నం ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తుని అనుసరించి అందరూ ప్రేమ, కరుణ కలిగి జీవించాలని సందేశం ఇచ్చారు. అనంతరం సంఘస్తులు, గ్రామస్తులకు ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

శాంతి తత్వానికి మార్గదర్శకుడు

గుడ్లవల్లేరు: ప్రేమ, కరుణ, శాంతి తత్వానికి ఏసు క్రీస్తు మార్గదర్శకుడని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర మాజీ కన్వీనర్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని బుధవారం మామిడికోళ్ల చర్చిలో క్రిస్మస్ కేక్‌లను స్థానిక చర్చిల్లో ఆయన చేతుల మీదుగా కట్ చేశారు. తొలుత చర్చిలకు కేకులతో పాటు పండ్లను చిత్తర్వు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చావా నాగేశ్వరరావు, బద్రెడ్డి బద్రీనాథ్, నిరీక్షణరావు, గోపి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: ఏసు క్రీస్తు కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొవ్వ ఆర్సీఎం చర్చి ఫాదర్ జాకబ్ ప్రసాద్ పేర్కొన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం అర్ధ రాత్రి బాలయేసుకు ప్రత్యేక పూజలు చేసి కొవ్వొత్తులతో స్వాగతం పలికారు. పెదపూడి బేతేలు చర్చిలో మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు డాక్టరు రెవరెండ్ ఫాదర్ అప్పికట్ల ఇమ్మానియేల్, మొవ్వ యేసే జవాబు ప్రాంగణంలో నిర్వాహకులైన కృష్ణా జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధ రాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలు అంబరాన్ని అంటాయి.



గుడివాడలో క్రీస్తు సందేశాన్ని అందిస్తున్న పాస్టర్లు మైఖేల్, శ్రీకాంత్



ముదినేపల్లి ఆర్సీఎం చర్చిలో..

ప్రత్యేక ప్రార్థనలు

గుడివాడరూరల్: పట్టణంలోని పలు చర్చిల్లో బాలయేసు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు ఆగమనాన్ని స్వాగతిస్తూ గీతాలాపనలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెట్ ఆర్సీఎం దేవాలయం, కోతిబొమ్మ సెంటర్‌లోని అవిలాపురి చిన్న తేరాజమ్మ ఆర్సీఎం–2లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఫాదర్లు గుజ్జల మైఖేల్, శ్రీకాంత్, ఎం.లూయిస్‌రాజు, బొడ్డు ఆనందబాబు క్రీస్తు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి విలియం జోషి, సభ్యులు సువర్ణరాజు, కిరణ్,బెనర్జీ, ఆంటోని పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాము ప్రత్యేక ప్రార్థనలు

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఏలూరురోడ్డులోని ఆర్సీఎం చర్చిలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన ప్రార్థనల్లో పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బాలయేసుకు ప్రత్యేకంగా తయారు చేసిన పుష్పాలు కానుకగా సమర్పించారు.



మామిడికోళ్ల చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు



గుడివాడ ఆర్సీఎం-2 చర్చిలో సందేశాన్నిస్తున్న పాస్టర్ లూయిస్



పామర్రులో మాట్లాడుతున్న ఎంపీపీ అశోక్‌కుమార్

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వణుదుర్రు, ముదినేపల్లి ఆర్సీం చర్చిల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ ప్రేమ, కరుణ, సేవలతో కూడిన శాంతియుత జీవన మార్గాన్ని క్రీస్తు ఈ ప్రపంచానికి అందించారని విశ్వాసులకు ఉపదేశించారు. శ్రీహరిపురం బీసీ కాలనీ ఇమ్మానియేల్ చర్చిలో పాస్టర్ ఏసుదాసు ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. కొరగంటపాలెం ఇమ్మానియేలు చర్చిలో పాస్టర్లు ఉచ్చుల విజయ్‌కుమార్, స్వర్ణన్‌రాజు సింగరాయపాలెం ప్రేమస్వరూపిణి ప్రార్థనా మందిరంలో బండి డేవిడ్‌రాజు, కొత్తపల్లి న్యూజెరూసలేము ప్రార్థనా మందిరంలో పాస్టర్ పీటర్, పెయ్యేరు షాలేము ప్రార్థనా మందిరంలో పాస్టర్ మోత్రు ఏసురత్నం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.



కైకలూరు ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు



పెదమద్దాలిలో క్రీస్తు బోధనలను తెలుపుతున్న పాస్టర్ కృష్ణపాల్



మేడూరులో సందేశం ఇస్తున్న పాస్టర్ రాజారత్నం

కైకలూరులో..

కైకలూరు: ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా వాడవాడలా ప్రభు ఏసు జన్మదినోత్సవాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు చర్చిల్లో ఏర్పాటు చేసిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. పండ్లు, స్వీట్లు దుకాణాల వద్ద రద్దీ కనిపించింది.

మండవల్లిలో..

మండవల్లి: క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండవల్లిలోని హోలీ ఆర్మీ ఫెలోషిప్ చర్చిలో నిర్వాహకురాలు రాణీ అబ్రహం ఆధ్వర్యంలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఐజక్, సుదర్శనరావు, రాజేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెదపారుడిలో..

పెదపారుపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పెదపారుపూడిలోని రక్షణ సైన్యం చర్చిలో ఫాదర్ మేజర్ విజయ్‌కుమార్ ప్రత్యేక పార్థనలు చేశారు. సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ప్రధాన పోస్టుల్లో ఇన్‌చార్జులు.. సేవల్లో జాప్యం

మండవల్లి: మండవల్లిలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని ప్రధాన పోస్టులన్నింటిలో ఇన్‌చార్జులు కొనసాగుతుండటంతో సకాలంలో పనులు పూర్తవక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరారవు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు ఆరోపించారు. మండవల్లిలో బుధవారం వారు మాట్లాడుతూ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 18 నెలల నుంచి సీనియర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కొన్ని నెలలుగా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో దిగువ స్థాయి ఉద్యోగులే ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారన్నారు. మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ ఇన్‌చార్జి డాక్టరే పనిచేస్తునట్లు పేర్కొన్నారు. దీంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ వివిధ పనుల నిమిత్తం రోజుల తరబడి తిరుగాల్సి వస్తోందని ఐక్య వేదిక నాయకులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఖాళీ పోస్టుల్లో శాశ్వతంగా అధికారులను నియమించి ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలి

గుడివాడరూరల్: వాజ్‌పేయి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని మంచి పాలన అందించాలని ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. స్థానిక ధనియాలపేటలోని ప్రణవాశ్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వలపర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వాజ్‌పేయి జయంతి వేడుకలను నిర్వహించారు.

బీజేపీ కార్యాలయంలో..

గుడివాడరూరల్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను స్థానిక బిజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామినేని వెంకటకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబులు తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలను స్థానిక హితమ్ స్కూల్లో ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కళాపీఠం అధ్యక్ష,కార్యదర్శులు కాటూరి వెంకట మురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి బీజేపీ నాయకులు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం, గన్నవరంలో అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి ఉత్సవాలను బీజేపీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

● మంచు దుప్పటి

గుడ్లవల్లేరు: మంచు దుప్పటి కప్పిందా? అన్నట్లుగా ఆహ్లాదపరిచే ఈ పొగమంచుతో పాటు బుధవారం గుడ్లవల్లేరు మండలంలో అక్కడక్కడా వర్షపు జల్లులు కురిశాయి. ఈ జల్లు వానతో పాటు ఉదయం సూర్యరశ్మి రాకుండా తెల్లటి పొగ మంచు కప్పేసింది. ఈ శీతాకాల వానకు ఆరుబయటకు వచ్చే జనం జర్కిన్లతో పాటు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లను ఆశ్రయించారు.



రోడ్డుపై ఏర్పడిన పొగమంచు

ఘనంగా ధనుర్మాస పూజలు



పామర్రులో గోదాదేవి రంగనాథ స్వామికి పూజలు



గొబ్బెమ్మలకు పూజలు చేస్తున్న భక్తులు

పామర్రు: మండలంలోని పలువైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పూజలను బుధవారం ఘనంగా నిర్వహింరు. స్థానిక విష్ణాలయంలో తొలుత బిందె తీర్థంతో మంత్ర జలాలను తీసుకొచ్చి విశేషంగా అభిషేకాలను చేశారు. అనంతరం ఆలయంలో గోదాదేవి రంగనాథ స్వామికి పూజా కార్యక్రమాలను జరిపారు. తదుపరి తిరుప్పావై చదివి భక్తులకు వివరించారు. ఆలయంలో పూజలను అర్చకులు రొంపిచర్ల భార్గవ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు.

గొబ్బెమ్మలకు పూజలు

పామర్రు: ధనుర్మాసం నెల ప్రారంభం నుంచి సంక్రాంతి వరకు ఇళ్ల ముంగిట గొబ్బెమ్మలను పెట్టడం సాంప్రదాయం. ఈ నేపథ్యంలో బుధవారం ఇళ్లలో గొబ్బెమ్మలను ఆవు పేడతో తయారు చేసి వాటిని అలంకరించి ప్రత్యేక పూజలను చేశారు.

చంద్రబాబువి కల్లబొల్లి మాటలు

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరావు



పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హనుమంతరావు, నాయకులు

గుడివాడరూరల్: వైఎస్సార్ సీపీ పాలనలో విద్యుత్ చార్జీలు పెంచారని తాము అధికారంలోకి వస్తే చార్జీలు తగ్గిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 27న నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించనున్న విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్లను ఆయన కార్యాలయంలో నాయకులతో కలసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలి మాట్లాడుతూ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గెలిచిన తర్వాత చంద్రబాబుకు మర్చిపోవడం అలవాటేనన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ బాజీ, కొంకితల ఆంజనేయ ప్రసాద్, దుడ్డు చిన్న, షేక్ సయ్యద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి పూజలు

కోడూరు: వాసవీ అమ్మవారి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. కోడూరులోని దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ఉన్న అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి గాజులు, వివిధ రకాల పుష్పాలతో అలంకారం చేశారు. పసుపు, కుంకుమతో తీర్చిదిద్దిన అమ్మవారికి చిత్రపటం విశేషంగా తీర్చిదిద్దారు. అనంతరం వాసవీ అమ్మవారి ఉత్సవమూర్తిని ఆర్యవైశ్యుల ఇళ్లకు తీసుకువెళ్లి పూజలు చేశారు. యువత డప్పువాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. గురువారం అమ్మవారికి పాలపొంగళ్లను సమర్పించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



పసుపు, కుంకుమతో తీర్చిదిద్దిన అమ్మవారి చిత్రపటం

సహస్ర కలశాభిషేకం



మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీ బొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం విశేష ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం పడిపూజ కార్యక్రమాన్ని కేరళ తంత్రి పద్మనాభం సంబూద్రి వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.



వరి కోతలు కోస్తున్న మహిళలు

● జల్లులతో రైతుల గుండెల్లో రైళ్లు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షం జల్లులతో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు వ్యయప్రయాసలకోరుస్తున్నారు. ఇప్పటికే తుపాను బారిన పడిన రైతులు మరొకసారి వర్షాలకు దొరక్కుండా ఉండేందుకు బుధవారం తమ పొలాల్లో పంటను దక్కించుకునేందుకు వ్యవసాయ పనులను శర వేగంగా కొనసాగించారు. ఒకసారి ఎండగా ఉంటూ.. మరోసారి చినుకులు రాలే విచిత్ర వాతావరణంతో రైతుల గుండెల్లో గుబులు ఏర్పడింది.

- గుడ్లవల్లేరు



కట్టల్ని గట్టుకు చేరుస్తున్న కూలీలు



రోడ్ల వెంబడి కుప్పలు వేస్తున్న దృశ్యం



కుప్ప నూరుస్తున్న కూలీలు